క్లుప్తంగా

నేడు సమాన సంస్కార మహోత్సవం

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి ఓల్డ్ గాయత్రినగర్‌లోని శ్రీ శారదా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం 'సమాన సంస్కార మహోత్సవము' నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి, బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ, ఉస్మానియా వర్సిటీ తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ అనంతలక్ష్మి హాజరవుతారని చెప్పారు.

లోక్‌సభ మాజీ స్పీకర్‌కు సన్మానం



మీరా కుమార్‌ని సన్మానిస్తున్న రవికుమార్

పహాడీషరీఫ్: తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌కు విచ్చేసిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌కి కాంగ్రెస్ పార్టీచేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మన్నె రవికుమార్, జల్‌పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ బారీలు సన్మానించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల వారి వాస్తవ పరిస్థితులను ఆమెకు వివరించారు.

స్వామి వారికి ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడెం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు చేసి అలకరించారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జి.శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

వనస్థలిపురం: సచివాలయ నగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ అష్టమ వార్షికోత్సవాలను నాలుగు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్, ఆలయ చైర్మన్ వేముల జయరాములు, ఫౌండర్ చింతల రవికుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణతో పాటు వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తడకమళ్ల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారి పూజలో ఏసీపీ



ఏసీపీకి అమ్మవారి ప్రసాదాన్ని అందజేస్తున్న సెక్రెటరీ దంపతులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఆది పరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు వారికి అమ్మవారి జ్ఞాపకను ప్రసాదాన్ని అందజేశారు.

మహిళ అదృశ్యం



తిరుపతమ్మ

హస్తినాపురం: ఇంటి నుంచి బయటికి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం యాపట్ల గ్రామానికి చెందిన తడారి తిరుపతమ్మ (50), మాసయ్య దంపతులు హస్తినాపురం ఈస్ట్ కాలనీలో నివాసం ఉంటున్నారు.. శుక్రవారం మధ్నాహం ఇంట్లో వారికి చెప్పకుండా తిరుపతమ్మ బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కంగారుపడ్డ ఆమె కుటుంబ సభ్యులు బంధు,మిత్రులను వాకబు చేసినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుకు బంధువు బీఆర్‌ఎస్



మహేశ్వరం: రైతులను సన్మానిస్తున్న యాదయ్య, సురేందర్‌రెడ్డి



కందుకూరు: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ తదితరులు

జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య

మహేశ్వరం: రైతుకు బంధువుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతు వేదికలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవం కార్యక్రమం నిర్వహించి రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, మార్కెట్ కమి టీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, నాసర్‌ఖాన్,అశోక్,పీఏసీఎస్ డైరెక్టర్లు కడమోని ప్రభాకర్,పాల్కం బాలయ్య, ఏఈఓ అనూష పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

కందుకూరు: రైతుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. మండలంలోని కందుకూరు, నేదునూరు, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, పులిమామిడి గ్రామాల్లోని రైతు వేదికల వద్ద శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులను రాజులా చేయాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఏఓ గీతారెడ్డి, ఏడీఏ సుజాత, ఏఓ లావణ్య, ప్రత్యేకాధికారిణి సంగీత, ఏఈఓలు రాజు, ప్రభావతి, సృజన, రాఘవేంద్రచారి, అర్చన, శ్రీహరి, రైతు బంధు అధ్యక్షుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం



అనాథలకు దుస్తులు పంపిణీ చేస్తున్న అమరేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథాశ్రమంలో మానసిక దివ్యాంగులకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎల్మేటి అమరేందర్‌రెడ్డి అన్నదానం చేశారు. శనివారం అయన మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో మానసిక దివ్యాంగులకు అన్నదానం తర్వాత పండ్లు, సబ్బు లు, దుస్తులు అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ చైర్మన్ అహ్మద్ బామ్, వంగేటి మధుసూధన్‌రెడ్డి, ఆంజనేయులు, రామస్వామి, నున్యనాయక్, సాయి గౌడ్, ఆశ్రమ నిర్వాహకులు గట్టుగిరి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

- ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి



మాట్లాడుతున్న శ్రీదేవి

ఇబ్రహీంపట్నం రూరల్: కక్షి దారులకు రాజీ మార్గమే రాజమార్గమని ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లు ఉపయోగపడతాయన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడకుండా లోక్‌అదాలత్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, ప్రిన్స్‌పాల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్, సీఐలు రామకృష్ణ, రవికుమార్, లోక్ అదాలత్ సభ్యుడు శ్రీనివాస్‌కుమార్, రవి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తా



కూరగాయల రైతులను సన్మానించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: ఎల్బీనగర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి హయత్‌నగర్ డివిజన్‌లో సుమారు 1.38 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. వీరభద్రనగర్ ఫేజ్-2లో రూ.24 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను, ఆనంద్‌నగర్‌లో రూ.18 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, అన్మగల్ బస్తీలో రూ.12.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, షిర్డీ నగర్‌లో రూ.39.6 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, హుడా సాయి నగర్‌లో రూ.21 లక్షలతో అంతర్గత డ్రైనేజీ పనులకు, ఆటో సాయినగర్‌లో రూ. 8.5 లక్షలతో చేపట్టే అంతర్గత డ్రైనేజీ నిర్మాణానికి శంస్థాపన చేశారు. అలాగే, హయత్‌నగర్ ఓల్డ్ విలేజీలో బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్‌బీనగర్‌ను సమస్యలు లేని నియోజకవర్గంగా చేసి రోల్ మోడల్‌గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగంలో అద్భుత ప్రగతి

ఎల్‌బీనగర్: తెలంగాణ రాష్ట్రం ఈ దశాబ్ద కాలంలో అద్భుతమైన ప్రగతి సాధించిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్‌నగర్‌లోని రైతుబజార్‌లో శుక్రవారం రైతు సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రైతులను సన్మానించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడినప్పుడు వరి ఉత్పత్తిలో దేశంలో 15వ స్థానంలో ఉండగా... నేడు అగ్రగామిగా ఉందని, ఉత్పాదకతలో తెలంగాణ రెండవ స్థానంలో ఉందని ఆయన చెప్పారు. ఈ ఘనత కేవలం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని పథకాలను రైతులకు అందించి వారి అభివృద్ధికి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం పలువురు రైతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీ దయానంద్‌గుప్తా, నాయకులు విఠల్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సాగర్‌రెడ్డి, ఈశ్వరమ్మయాదవ్ , పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన

- ఎంపీపీ జ్యోతి



నేదునూరులో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: బడీడు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని నేదునూరు ప్రాథమిక పాఠశాలలో స్థానిక సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన ఉంటుందన్నారు. ఐదేళ్ల వయస్సు ఉన్న పిల్లలను తప్పకుండా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పిల్లలకు మంచి చదువు అందించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.శ్రీనివాస్, వార్డు సభ్యులు అఫ్జల్‌బేగ్, ఎ.నర్సింహ, అనసూయ, సీఆర్పీ వెంకటేశ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవిగౌడ్, నరసింహారెడ్డి, దీక్షిత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు గాయత్రి, మేరీ జోష్న, అంగన్‌వాడీ టీచర్లు యశోద, సుమతి, భారతమ్మ పాల్గొన్నారు.

మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



కద్లాల్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మైసిగండి మైసమ్మ ఆలయంలో ఆలయ నిర్వాహకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ట్రస్టీ శిరోలి, అర్చకులు యాదగిరి స్వామి, సిబ్బంది చంద్రయ్య, దేవేందర్ తదితరులు ఉన్నారు.

ఆలయాభివృద్ధికి నిరంతర సహకారం

తలకొండపల్లి: వేంకటేశ్వర ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని సంఘసంస్కర్త, ఆధ్యాత్మిక వేత్త కానుగుల యాదగిరి అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌లోని వేంకటేశ్వర ఆలయ గర్భగుడిలో గ్రామానికి చెందిన యాదగిరి రూ.26వేల విలువైన గ్రిల్స్ ఏర్పాటు చేశారు. శనివారం సర్పంచ్ శ్రీశైలంతో కలిసి గ్రిల్స్‌ను పరిశీలించి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, రైతుసంఘం నాయకుడు కృష్ణగౌడ్, మోహన్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

పాడిరైతుకు ఆర్థికసాయం

ఆమనగల్లు: మండల పరిధిలోని మేడిగడ్డతండాలో రైతు భీమకు చెందిన పాడి ఆవు ఇటీవల మృతి చెందింది. జీవనాధారమైన ఆవు మృతి చెందడంతో భీమ ఆందోళన చెందాడు. దీంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శనివారం బాధితుడికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవం

- ఆలయాభివృద్ధికి రూ.75వేల విరాళం

తలకొండపల్లి: ఎల్లమ్మ తల్లి ఆలయాభివృద్ధికి కృషి చేయనున్నట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌లో ఎల్లమ్మ దేవాలయంలో శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంబ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన ఆలయాభివృద్ధికి రూ.75వేల ఆర్థికసాయం అందజేశారు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో ఆలయ నిర్వాకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబర్ రహ్మాన్, గిరి, వెంకటేశ్, లక్ష్మీ, ఆరీఫ్, రాఘవేందర్‌రెడ్డి, భరత్, శివ, విజయ్, మహేశ్, నారాయణ, విష్ణువర్ధన్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేశానికే తలమానికం తెలంగాణ



తుర్కయంజాల్: అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

తుర్కయంజాల్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే తలమానికంగా నిలుస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ ఎస్‌ఎస్‌ఆర్ నగర్ నుంచి ఎం.ఎం.కుంట వరకు బీటీ రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధతో కలిసి ప్రారంభించారు. రాగన్నగూడలోని రాఘవేంద్ర నగర్‌కాలనీలో సీవరేజ్ వాటర్, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీశైలం, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువు పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

మాసబ్ చెరువు పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి చెరువులో చేపడుతున్న అక్రమ నిర్మాణాలు, మట్టి డంప్ గురించి వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే చెరువును పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పరిరక్షణ సమితి అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదిరెడ్డి, వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాన్‌సూన్ వాహనాలు సిద్ధం



మాన్‌సూన్ వాహనాలను ప్రారంభిస్తున్న జెడ్సీ పంకజ

ఎల్‌బీనగర్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా మాన్‌సూన్ వాహనాలను, సిబ్బందిని సిద్ధం చేశామని ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. శనివార ఆమె జెడ్సీ కార్యాలయ ఆవరణలో మాన్‌సూన్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయ పరిధిలోని 23 వార్డులు ఉండగా, ప్రతీ వార్డుకు ఒక మాన్‌సూన్ వాహనంతో పాటు అత్యవసర సేవలకు నలుగురు కార్మికులతోకూడిన 23 ట్రాక్టర్లు,12 స్టాటిక్ బృందాలు,ఇద్దరు కార్మికులను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ అధికారులు అశోక్‌రెడ్డి, హరిలాల్, నాగేందర్, రమేస్‌బాబు, కోటేశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్ల పనుల్లో నాణ్యత పాటించాలి



మ్యాన్‌హోల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చైతన్యపురి: మ్యాన్‌హోళ్ల పనులను నాణ్యతతో చేపట్టాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని పటేల్ నగర్ కాలనీలో జరుగుతున్న మ్యాన్‌హోల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రహదారులపై భారీ వాహనాలు వెళ్లడం వల్ల నాసిరకంగా ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. దీంతో మళ్లీ మళ్లీ పనులు చేయటం వల్ల ప్రజాధనం దుర్వినియోగం కావడమే కాకుండా కాలనీవాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, స్థానికులు శివరామ, టింకు, సందీప్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బూర నర్సయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడలతో మానసికోల్లాసం చేకూరుతుందని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో కొంగరకలాన్ ప్రీమియం లీగ్(కేపీఎల్)పేరుతో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సయ్యగౌడ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు క్రీడల్లో రాణించాలని సూచించారు.

కాటమయ్య పూజల్లో మాజీ ఎంపీ

మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో కాటమయ్య ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం ఆయన కాటమయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలోటీపీసీసీ ప్రధాన కార్యదర్శి శివకుమార్, పొట్టి రాములు, వీరస్వామి, నీళ్ల హరిదాసు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్‌లో తారాస్థాయికి వర్గపోరు

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాంమోహన్‌గౌడ్‌ల ఆధిపత్య పోరు
- మంత్రి కేటీఆర్ సమక్షంలోనే ఇరువర్గాల బాహాబాహీ



వనస్థలిపురం వచ్చిన మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాంమోహన్‌గౌడ్ తదితరులు



బాహాబాహీకి దిగిన సుధీర్‌రెడ్డి, రాంమోహన్‌గౌడ్ అనుచరులు

వనస్థలిపురం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్‌లో గ్రూపు తగాదాలు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ ముద్దగోని రాంమోహన్‌గౌడ్‌ల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. మంత్రి కేటీఆర్ సమక్షంలోనే ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. ఇందుకు పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వనస్థలిపురం పర్యటన వేదికగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి కేటీఆర్ ప్రైవేట్ సెక్రటరీ కానుగుల శ్రీనివాస్ వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ తల్లి రాములమ్మ గత నెల 18న మృతి చెందారు. ఆ సమయంలో మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలో ఉన్నారు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన ఆయన శనివారం శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించడానికి శాంత్‌నగర్‌కు వచ్చారు. కేటీఆర్ రాక సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాంమోహన్‌గౌడ్, బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులు పెద్దసంఖ్యలో అక్కడికి వచ్చారు. కాగా కేటీఆర్ వెళ్లిపోయే సమయంలో సుధీర్‌రెడ్డి అనుచరులు సుధీర్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేయడంతో, ప్రతిగా రాంమోహన్ గౌడ్ అనుచరులు రాంమోహన్‌గౌడ్ జిందాబాద్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఇరు గ్రూపుల నినాదాలతో ఉద్రిక్తత నెలకొని ఒకరినొకరు నెట్టుకునే వరకు పరిస్థితి వెళ్లింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించివేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఎన్నికల ముందే బీఆర్‌ఎస్‌లో గ్రూపు రాజకీయాలు ఇలా ఉంటే.. ఎన్నికల సమయంలో ఇంకా ఎలా ఉంటాయోనని స్థానికులు పేర్కొంటున్నారు.